## క్లుప్తంగా

### 'శ్రీకృష్ణ కమలపాలిక' ఎంపిక



నాటకంలోని ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో జూలై 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కమల పాలిక' పద్య నాటకం ఎంపికైనట్లు నాటకాల నిర్వాహకులు బీఎస్ రెడ్డి ప్రకటించారు. కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య నాటకానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన శ్రీకృష్ణ కమల పాలిక నాటకం కళాకారులను ఆయన అభినందించారు.

### 27న గుంటూరులో రాష్ట్ర మహాసభలు



యూనియన్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 27వ తేదీన గుంటూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధ్యక్షుడు బాలునాయక్ అన్నారు. సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ మహాసభకు వైద్య ఉద్యోగులందరూ కదిలిరావాలని బాలునాయక్ కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ ఖాజాముద్దీన్, ట్రెజరర్ సురేష్, యూనియన్ నాయకులు హరిచంద్రనాయుడు, నరసింహులు, సుందర్‌రాజు, రంజిత్, రాజు, మల్లికార్జున, ఉరుకుందయ్య, రమేష్, పరశురాముడు, చెన్నయ్యదాస్, సత్యనారాయణ, నూర్ అహ్మద్, గిరి పాల్గొన్నారు.

### బీసీ హాస్టళ్లను ఎత్తివేస్తే ఆందోళన చేస్తాం



పర్యవేక్షకుడికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్‌లో ఉన్న ప్రభుత్వ బీసీ, డీఎన్‌టీ బాలుర వసతి గృహాలను ఎత్తివేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాయలసీమ అధ్యక్షుడు సురేంద్ర బాబు, జిల్లా అధ్యక్షులు ఈశ్వర్‌యాదవ్ హెచ్చరించారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా బీసీ సంక్షేమం సాధికారత అధికారి కార్యాలయం పర్యవేక్షకుడు శ్రీధర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఈ రెండు హాస్టళ్లు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల నుంచి పేద విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేందుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ హాస్టళ్లను పలు కారణాలతో ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు.

### మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులిచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

### దళితపేటల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ ఆనందబాబు

కర్నూలు(సెంట్రల్) : దళిత పేటల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం కల్లూరు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేవీపీఎస్ నాయకులు, కార్యకర్తలు దళితవాడల్లోని సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

### చినుకు పడితే చెరువే!

కల్లూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కల్లూరు అర్బన్‌లోని రోడ్లు, వీధులు బురదమయంగా మారాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి కుంటలను, చెరువులను తలపిస్తున్నాయి. నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని ఖాళీ స్థలంలో వర్షపు నీరు నిలవడంతో చెరువులా కనిపిస్తోంది. పందిపాడు ఇందిరమ్మ కాలనీలో వర్షం నీరు నిలిచింది.

# నీట్ ఫలితాలపై నిరసన

● అవకతవకలపై విచారణ చేపట్టాలి ● నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి ● విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు



శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఏ నాయకులు

కర్నూలు సిటీ: వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకాలపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఏఐఎస్ఎఏ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఆ సంఘం నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నీట్ యూజీ–2024 పరీక్షలో ఒకే కేంద్రంలో పరీక్షలు రాసిన విద్యార్థుల మార్కులను చూసి దేశంలో ఎంతో మంది ఆశ్చర్యపోతున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశం కావడంతో తక్షణమే కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి అక్రమాలకు పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ పరీక్షలో 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులతో ఫస్ట్ ర్యాంకు రావడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. అదే విధంగా అత్యధిక విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారని, నీట్‌లో నెగిటివ్ మార్కులు ఉన్నా ఈ స్థాయి మార్కులు రావడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని చెప్పారు. నీట్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, పవన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

**నీట్ పరీక్షల కుంభకోణంపై విచారణ జరపాలి**

కర్నూలు(సెంట్రల్) : నీట్ యూజీ పరీక్షల్లో చోటు చేసుకున్న అవినీతి కుంభకోణంపై విచారణ జరపాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..జూన్ 4వ తేదీన విడుదలైన నీట్ పరీక్షల మార్కులపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కొన్ని సెంటర్లలో పరీక్ష రాసిన వారికే ఎక్కువ మార్కులు రావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ అనుమానాలపై ఎన్‌టీఏ ఇస్తున్న సమాధానం విడ్డూరంగా ఉందని, గ్రేస్ మార్కులు కలపడంతోనే కొందరికీ మార్కులు వచ్చాయని చెప్పడం అన్యాయమన్నారు. నీట్ కుంభకోణంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన తరువాతే విద్యార్థులకు అడ్మిషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహేష్, నాయకులు అజయ్‌కామత్, సురేష్, మొబీనా, శివప్రసాదు, అభిలాష్, చరణ్, తినాథ్, నవీన్, జహీర్, ఉన్నతి, ప్రియ పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ.. కేసులు ఇలా

● ట్రబుల్ మాంగర్స్‌పై దాదాపు 2,186 కేసులు
● 13 చెక్‌పోస్టుల ద్వారా రూ.8.20 కోట్ల నగదు సీజ్
● 17 వేల లీటర్ల ఎన్‌డీపీఎల్ మద్యం పట్టివేత

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను పోలీసులు జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు. అయితే, ఇందుకోసం వారు ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పలు చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు 13 కేసులు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, నగదు తరలింపు, ఇతర కేసులు కూడా ఎక్కువగానే నమోదయ్యాయి. ట్రబుల్ మాంగర్స్‌పై దాదాపు 2,186 కేసులు నమోదు కాగా, అందులో 5,574 మందిని బైండోవర్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎన్నికల సందర్భంగా తనిఖీలు నిర్వహించి రూ.8.20 కోట్ల నగదు పట్టుకున్నారు. అలాగే 17 వేల లీటర్ల ఎన్‌డీపీఎల్ మద్యం పట్టుకుని కేసులు ఫైల్ చేశారు. తనిఖీల్లో రూ.5.15 లక్షలు విలువ చేసే 785.466 గ్రాముల బంగారం, రూ.2.45 లక్షల విలువ చేసే వెండి కూడా పట్టుబడింది. అలాంటి వారిపై 790 ఎఫ్ఐఆర్‌లు, కేసులు నమోదయ్యాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో స్టాటిక్ సర్వలయన్స్ టీమ్స్ 26, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 32, ఎంసీసీ టీమ్స్ 36 కేసులు నమోదు చేశారు. ఇవన్నీ ఎన్నికల నిబంధనల ఉల్లంఘనల కిందనే నమోదయ్యాయి.



అక్రమ రవాణాపై చెక్‌పోస్టులో తనిఖీ నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం (ఫైల్)

## వైద్య విద్యార్థి మృతికి సంతాపం



ఆసుపత్రిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు (హాస్పిటల్) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైద్య విద్యార్థి తేజేశ్వర్ రెడ్డికి సంతాపంగా సోమవారం వైద్య విద్యార్థులు కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయంత్రం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థి మృతికి ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కళాశాల వద్ద అధికారులు స్పీడ్‌బ్రేకర్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి పలువురు వైద్యులు, సిబ్బంది మద్దతు తెలిపారు.

### నకిలీ విత్తనాలను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్ రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేయకుండా అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ..పత్తి, మొక్కజొన్న, కంది, మిరప, ఉల్లి ఆముదం, కొర్రలు, మినుము రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలన్నారు. వెంటనే పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. బ్యాంకుల నుంచి రైతులకు రుణాలు ఇప్పించాలని కోరారు.

### 16న బాలవికాస్ గురువులకు శిక్షణ

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని శ్రీ సత్య సాయి సేవా సదన్‌లో ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఏపీ రాష్ట్ర పదాధికారులతో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా పదాధికారులు, కన్వీనర్లు, బాలవికాస్ గురువులకు ఓంకారం, సుప్రభాతం, జ్యోతి ధ్యానం, భజన నిర్వహణపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

### డిగ్రీ పరీక్షలకు 91 శాతం హాజరు నమోదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 91 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులకు ముగ్గురు, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు 1,767 మందికి 1,608 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, జోన్ వైష్ణవి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ లైన్‌లు, సబ్ స్టేషన్‌ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతుండటం వల్ల మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ శాఖ ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ అవుతుందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ సెక్షన్ పరిధిలోని పార్థసారథి నగర్–1, 2, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా–1, 2, అంబేడ్కర్ నగర్, ఎన్‌జీవోస్ కాలనీ, కమలానగర్‌లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అదే విధంగా సీతారాం నగర్, ఎల్ఐసీ కాలనీ, ఇల్లూరు నగర్, మార్కెట్ యార్డు ఏరియా ప్రాంతాలకు ఉదయం 9 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు.

## సీఐటీయూ బలోపేతమే పర్సాకు నిజమైన నివాళి



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్) : సీఐటీయూను బలోపేతం చేయడమే కార్మికోద్యమ నేత తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్సా సత్యనారాయణకు నిజమైన నివాళి అని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ గఫూర్ అన్నారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో పర్సా సత్యనారాయణ శత జయంతి సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సీఐటీయూ నాయకులు ఎంఏ గఫూర్, పీఎస్ రాధాకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గఫూర్ మాట్లాడుతూ..పర్సా సత్యనారాయణ, నండూరి ప్రసాదరావు నిర్మించిన సంఘమే సీఐటీయూ అని, వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నరసింహులు, విజయ్, ప్రభాకర్, సుధాకరప్ప పాల్గొన్నారు.

## సీఎం ప్రమాణ స్వీకారానికి జిల్లా పోలీసులు

కర్నూలు : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి భారీగా పోలీసు బందోబస్తు తరలివెళ్లింది. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వివిధ హోదాలో ఉన్న 528 మంది పోలీసులు కృష్ణా జిల్లా గన్నవరంకు తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 10 మంది సీఐలు, 58 మంది ఎస్ఐలు, 118 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 254 మంది కానిస్టేబుళ్లు, 42 మంది మహిళా పోలీసులు, హోం గార్డులు, 34 మంది ఏఆర్ సిబ్బందిని సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం వద్ద బందోబస్తు విధులకు నియమించడంతో వారంతా సోమవారం సాయంత్రం బయలుదేరివెళ్లారు.

### జీఓ నంబరు 84ను రద్దు చేయాలి

కర్నూలు సిటీ: మున్సిపల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేస్తూ ఇచ్చిన జీఓ నంబరు 84ను వెంటనే రద్దు చేయాలని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ స్కూల్ టీచర్ల సమస్యలపై ఆ సంఘం కౌన్సిల్ సమావేశాన్ని గుగూల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ విద్య బలోపేతానికి జీఓ నెంబరు 117ను సైతం వెంటనే రద్దు చేయాలని, ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవి సిద్దార్థ, ఉపాధ్యక్షులు ఎస్.ఎస్. షర్మిళ, సునీత, కె.మోహన్, ఎస్.కె శ్రీనివాస్, జి.కెన్నెడీ బాబు, రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నేరేడు పండ్లను కొనుగోలు చేస్తున్న దృశ్యం

## నోరూరించే నేరేడు



కర్నూలు (న్యూటౌన్): నేరేడు.. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఫలం. సహజసిద్ధంగా లభించే ఈ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తీపి, వగరు, పులుపు రుచులతో నోట్లో వేసుకోగానే కరిగిపోతుంది. వానకాలంలో ఈ పండు విరివిగా దొరుకుతుంది. చూడగానే నోరూరించే ఈ నేరేడు పండు పలు రుగ్మతలను నివారిస్తుంది. ముఖ్యంగా మధుమేహం తగ్గుముఖం పడుతుంది. అతిమూత్ర వ్యాధి నివారణతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అందుకే ఈ నేరేడు పండ్లకు మార్కెట్‌లో భలే డిమాండ్. ప్రస్తుతం సీజన్ కావడంతో నగరంలో విరివిగా లభిస్తున్నాయి. చాలా మంది చిరువ్యాపారులు ఈ నేరేడు పండ్లను కర్ణాటక, హిందూపురం పరిసర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి కలెక్టరేట్, పాత బస్టాండు, కొత్తబస్టాండ్, సీ క్యాంప్ తదితర ఏరియాల్లో విక్రయిస్తున్నారు. సైజును బట్టి కిలో రూ.250 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు.

## విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

కోడుమూరు రూరల్: మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రతి దుకాణదారుడు వ్యవసాయశాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని తెలిపారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయొద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అమ్ముతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**రైతులకు కొర్ర, కంది విత్తనాలు పంపిణీ**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా మంజూరైన కొర్ర, కంది విత్తనాలను ఏఓ రవిప్రకాష్ కోడుమూరు రైతులకు అందజేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వార ఐసిపిఎల్ 87119 రకం కంది విత్తనాలు కిలో రూ.98, ఎస్ఐఏ 3156 రకం కొర్రలు రూ.44తో రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అలరించిన భజన కార్యక్రమం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఎస్ పెద్దపుల్లమ్మ బృందం, మహానంది, నంద్యాల జిల్లా వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమములో వినాయక దేవగణేశ, శ్రీశైలం శివమయం, శివ శివయనరాదా. మనసారా నిన్నే కొలచితిని, శ్రీమల్లికార్జున దయచూపరా, శివనామమంత్రం, ఓం నమఃశివాయ, అమ్మపరమేశ్వరి, శంభో... శివశంభో, శ్రీశైలం శివమయం తదితర భక్తిగీతాలు, అష్టకాలను ఎస్. పెద్దపుల్లమ్మ, ఎస్. రంగయ్య, ఆర్. ముకుందరావు, ఎం.ప్రతాప్, టి. నవీన్ కుమార్ ఆలపించారు.



మల్లెతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

### ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

కల్లూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు ప్రోత్సాహమిస్తామని జిల్లా నీటి యజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (డ్వామా పీడీ) అమర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం చిన్నటేకూరులో సాగు చేసిన మల్లెతోటను పరిశీలించారు. రైతుతో పంట దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## గిరిజనులకు రెండు మంత్రి పదవులివ్వాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో త్వరలో ఏర్పాటు కానున్న మంత్రివర్గంలో ఇద్దరు గిరిజన నేతలకు మంత్రి పదవులు కల్పించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప కోరారు. గిరిజన సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు కేటాయించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికంగా గిరి, శిఖర గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించేందుకు అటవీ శాఖ అనుమతులు పొందడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ఎంతో విలువైన ఖనిజ సంపద, కలపను రక్షించుకునేందుకు ఆయా శాఖలను గిరిజన ఎమ్మెల్యేలకు కేటాయించాలన్నారు.

## 13 నుంచి లౌబాలి దర్గా ఉరుసు



నగరంలోని లౌబాలి దర్గా

కర్నూలు(అర్బన్): నగరంలో గురుస్వరూపులుగా వెలసిన హజరత్ సయ్యద్ షా అబ్దుల్ లతీఫ్ అల్ ఖాదరి అల్ హైదరీ లౌబాలి ఖద్దస సిర్రహుల్ అజీజ్ 395వ ఉరుసును ఈ నెల 13, 14, 15వ తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఠాధిపతి డా.సయ్యద్ ఆరీఫ్ పాషా ఖాద్రీ, జిల్లా మైనారిటీ నాయకులు నజీర్‌హుసేన్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 13వ తేదీ రాత్రి 10 గంటలకు తరీయస్ ఖిలే – ముషాయిరా, 14న ఉదయం నమాజు, అనంతరం గుసులేషరిఫ్, సాయంత్రం అసర్ నమాజు, హల్‌ఖే జికర్, మగరీబ్ నమాజు, వలి అల్లాహ్ గొప్పతనంపై ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ఇషా నమాజు అనంతరం పీఠాధిపతి ఇంటి నుంచి దర్గాకు గంధం బయలుదేరుతుందన్నారు. 15వ తేదీన ఖురాన్ గ్రంథ పఠనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలన్నీ హజరత్ సయ్యద్‌షా అబ్దుల్లా హుసైనీ బాద్‌షా అల్ హైదరీ ఆధ్వర్యంలో జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

### వ్యాధిగ్రస్తులకు ఎమ్మెల్యే చేయూత



ఎమ్మెల్యే టీజీ భరత్‌కు బొకే అందజేస్తున్న మెర్సీ హోం నిర్వాహకులు

కర్నూలు: గార్గేయపురం శివారులోని లెప్రసీ సెంటర్ మెర్సీ హోంలో ఉంటున్న వ్యాధిగ్రస్తులకు కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, మాజీ పార్లమెంటు సభ్యులు టీజీ వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. 23 సంవత్సరాల నుంచి హెచ్ఐవీ, ఎయిడ్స్, లెప్రసీ బాధితులు మెర్సీ హోంలో ఉంటున్నారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలని నిర్వాహకులు కోరడంతో ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సానుకూలంగా స్పందించి పై సహాయం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం వారిని మెర్సీ హోం నిర్వాహకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.